# రేపటి యంత్రాలు

- మున్నంగి పద్మలత

తెల్లవారుఝామున ఐదుగంటలకు గడియారం ఠంగ్...ఠంగ్‌మని కొట్టే సరికి నాకు మెలకువ వచ్చింది.

మంచినీళ్ళు తాగి మళ్లీ కునుకు తీద్దామనేసరికి హాల్లోంచి మా కోడలి మాటలు వినిపించి అక్కడికి వెళ్లాను.

"ఊ..చెప్పరా చెప్పు. ఈ ప్రశ్నకు జవాబు చెప్పు. ఈ రోజు సాయంత్రానికల్లా ఈ పుస్తకమంతా బట్టీపట్టి నాకు అప్పజెప్పాలి"

"అలాగే అమ్మా" అని మూలుగుతున్నాడు నా మనవడు.

"అమ్మా సీతా! ఇంత పొద్దున్నే వాడిచేత ఏంటి చదివిస్తున్నావు?" అడిగాను నేను.

"ఏంలేదు మామయ్యా జనరల్ నాలెడ్జ్" చెప్పింది కోడలు.

"ఎందుకమ్మా ఇవన్నీ. వాడి వయసెంతని? నిండా నాలుగేళ్ళులేవు. పైగా వాడిని ఇంకా స్కూల్లో జాయిన్ చేయలేదు కదా?" అడిగాను నేను మనవడి తల నిమురుతూ.

"మీకు తెలియదు మామయ్యా. ఈ రోజుల్లో పిల్లలు ఎలా వుంటున్నారు? వయసుకు మించి అన్నీ నేర్చుకుంటున్నారు. నేనింకా నీ మనవడి విషయంలో చాలా ఆలస్యం చేసాననిపిస్తోంది. మనం బడిలో వేయకముందే ఇవన్నీ చెబితే తరువాత వాడికి చదవడానికి సులువుగా కూడా వుంటుంది"

"సరేగానీ మరీ ఇంత పొద్దునేనా? పాపం వాడ్ని హాయిగా పడుకోనివ్వు"

"ప్రొద్దుటే చదివింది బాగా వంటపడుతుంది మామయ్యా. మీరు పడుకోండి" అంటూ బయటకు ముగ్గు పెట్టడానికి వెళ్లింది.

నా మనవడి అమాయక ముఖం చూస్తే జాలేసింది.

"ఏం నాన్నా! నిద్ర వస్తోందా?"

"లేదు తాతయ్యా!" అంటూ వస్తున్న నిద్రను ఆపుకుంటూ పుస్తకంలో లీనమైపోయాడు నా మనవడు.

"ఒరేయ్ ప్రసాద్! సీత ఎందుకురా వాడిచేత అంతలా చదివిస్తోంది" మా అబ్బాయిని అడిగాను.

"ఓ అదా! మొన్న మీరు టీవీ చూసే వుంటారు కదా?" అడిగాడు మా అబ్బాయి.

"అవును చూసాను. అయితే..."

"ఏంలేదు. ఎక్కడో మూడేళ్ల బాబు జనరల్ నాలెడ్జి ప్రశ్నలకి టకాటకా సమాధానాలు చెప్పాడట. ఆ బాబుకి చాలా బహుమతులు వచ్చాయిట. మొన్న టీవీలో చూపించారు. అది చూసి మనవాడికి అన్నీ వచ్చేయాలని ఆవిడ, అదే మీ కోడలి తాపత్రయం" వివరంగా అన్నీ చెప్పాడు మా అబ్బాయి.

అప్పుడే అనుకున్నాను మా కోడలు కారణం లేనిదే ఏ పనీ చేయదని.

"పులిని చూసి నక్క వాత పెట్టుకోవడమంటే ఇదే" ఎద్దేవా చేసాడు మా అబ్బాయి.

"అక్కడికి మీరేదో వాతలు పెట్టుకోనట్టు. మొన్న మీ బాస్ ఇంటికి వెళ్లినప్పుడు వాళ్ల మూడేళ్ల అబ్బాయి సంగీతంలో రాగాలన్నీ గడగడా పాడేస్తున్నాడని మన అబ్బాయికి కూడా సంగీతం నేర్పించాలని ముచ్చటపడింది మీరు కాదు" వాదనకు దిగింది మా కోడలు.

భార్య అన్న మాటలకు తనని తాను సమర్థించుకుంటూ ఏదో వాదిస్తున్నాడు మా అబ్బాయి. ఇంతలో నేను నా మనవడ్ని తీసుకుని అలా బయటకు నడిచాను.

★★★

"ఏమండీ పరంధామయ్యగారూ! బాగున్నారా?" పలకరించాడు నా స్నేహితుడు రాఘవయ్య.

"ఆ... బాగున్నాను మీరెలా వున్నారు? ఊరినుండి ఎప్పుడొచ్చారు?"

"నాలుగు రోజులైంది. మా చిన్న అబ్బాయి వాళ్ళు కూడా ఇక్కడికే వచ్చేస్తున్నారు. వాడికి ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ అయింది"

"అయితే మీకు చాలా కాలక్షేపమనుకుంటాను" అన్నాను నేను.

"ఏం కాలక్షేపమండి"

"అదేంటి మీ మనవలతో గడపడం మీకు కాలక్షేపం కాదా?"

"వాళ్లకు నాతో గడపడానికి టైం ఎక్కడుంటుందండీ? వాళ్ల చదువులతోనే సరిపోతోంది. మొన్న మా పెద్ద మనవడు ఏడేళ్లకే పదో క్లాసు పరీక్ష రాసాడని చెప్పానుకదా. వాడు ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు. ఇప్పుడు వాడిచేత ఇంటర్ పరీక్ష రాయిస్తారుట. మా అబ్బాయి, కోడలు వాడిచేత చదివించలేక తంటాలు పడుతున్నారు" చెప్పాడు రాఘవయ్య.

"మంచిదేగానీ ఈ విషయం మా అబ్బాయి, కోడలితో మాత్రం చెప్పొద్దు ప్లీజ్" చెబితే ఏం జరుగుతుందో ఊహించుకున్నాను నేను.

"అదేంటి?" ప్రశ్నార్థకంగా చూసాడు రాఘవయ్య.

"అలా కూర్చుని మాట్లాడుకుందాం రండి" నేను నా మిత్రుడు ఒక చోట కూర్చున్నాం . "ఇందాక..." అని పరంధామయ్య ఇందాకటి విషయం అడిగాడు.

"ఏంలేదు లెండి. ఊరికే అన్నాను. అయితే ఫస్ట్ క్లాస్ రావడానికి మీ మనవడు బాగా కృషి చేసాడన్నమట" అన్నాను నేను.

"కృషి చేసింది వాడు కాదండీ... చేసిందంతా మా అబ్బాయి, కోడలు. వాడిని సంవత్సరమంతా కూర్చోనివ్వలేదు, నుంచోనివ్వలేదంటే నమ్మండి. వాడికి స్వతహాగా తెలివితేటలు బాగానే వున్నా ఇంకా సానబెట్టాలని వాడ్ని రేయింబవళ్లు చదివించడమే పనిగా పెట్టుకున్నారు. ఆ కష్టమంతా ఊరికే పోలేదు. ఇప్పుడు ఫస్ట్‌క్లాస్ వచ్చింది. ఆ సంతోషం అంతా వాళ్లకే కదా మరి" అన్నాడు రాఘవయ్య.

"అయితే ఇప్పుడు ఇంకా కష్టపడి చదవాలి మీ మనవడు" అన్నాను నేను.

"అవును. నిండా పదేళ్ళు కూడా పూర్తికాక ముందే ఇంటర్ పూర్తి చేసేస్తాడు మావాడు'' అన్నాడు రాఘవయ్య గర్వంగా.

"సరే మరి నేను వస్తాను. బయటకి వచ్చి చాలా సేపయింది'' అంటూ లేచాను.

అక్కడనుండి ఇంటి ముఖం పట్టానేగానీ దారి పొడుగునా రాఘవయ్యగారి మనవడి గురించే ఆలోచిస్తూ నడిచాను.

పాపం వాడికి ఇంత చిన్న వయసులోనే ఎంత కష్టం వచ్చింది.

హాయిగా ఆట పాటలతో గడపాల్సిన వయసు తిరిగి రాదనిపించింది.

ఇలా ఆలోచిస్తూ ఇంటికి చేరేసరికి మా కోడలు గుమ్మం దగ్గర పక్కింటి విమలతో మాట్లాడుతూ కన్పించింది.

"ఏమ్మా విమలా బాగున్నావా?''

"బాగున్నానండీ'' బదులిచ్చింది.


"ఈమధ్య బొత్తిగా నల్లపూసవైపోయావేంటి?''

"లేదండీ. ఇంట్లోనే వుంటున్నాను. అలా బయటకు వెళ్తే చాలు పిల్లలు పుస్తకాలు వదిలేసి టీవీ చూస్తూనో, కంప్యూటర్ గేమ్స్ ఆడుతూనో చదవడం మానేస్తున్నారు'' అంటూ వెళ్లిపోయింది.

'హూ... ఇక్కడా ఇదే మాట. పిల్లలు చదువులు... ఒకరిని చూసి ఒకళ్ళు పోటీ పడుతున్నట్టున్నారు' అనుకుంటూ ఇంట్లోకి వెళ్లేసరికి మా కోడలు నా చేతిలో పెళ్లి శుభలేఖ పెట్టింది.

"మీ అన్నయ్యగారి మనవడి పెళ్లట. శుభలేఖ పంపించారు'' అంది కోడలు.

నేను పెళ్ళికి ప్రయాణం అయ్యాను. అక్కడ పెళ్ళిలో కూడా ఎవరిని కుశలప్రశ్నలు వేసినా పిల్లలు, చదువులు..ఇవే మాటలు. మా అన్నయ్య మనవడు నాలుగోక్లాస్ చదువుతున్నాడట.





# ఇలాంటి మామూలే

ప్రేమికులిద్దరూ వరుసగా సినిమాల్లో నటించాలని కోరుకోవడం అత్యాశ కాదు. అది సహజం. ఇప్పుడు ఐశ్వర్యారాయ్, వివేక్ ఒబెరాయ్ లిద్దరూ అలాగే అనుకుంటు న్నారు. క్యోన్ హో గయా... చిత్రంలో ఈ జంట మళ్లీ మనకి కనులపంట చేయనుంది. వీరిద్దరూ కలిసి నటిస్తున్న ఈ చిత్రం గురించి అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇందర్‌కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించడం కూడా చర్చనీయాంశంగా ఉంది. ఇండస్ట్రీలో ఇలాంటి మామూలే అంటున్నారంతా.

బాగా చదివితే ఏడో క్లాస్‌కి ప్రమోట్ చేస్తారట. అందుకని వాడిని వాడి అమ్మ దగ్గర వదిలేడు. వాడు మాత్రమే వచ్చాడు.

అన్ని పనులు చూసుకుని ఇంటికి చేరేసరికి నా మనవడు కంప్యూటర్ ముందు కూర్చుని కనబడ్డాడు. ఈ వారం రోజుల్లో ఇంత తొందరగా కంప్యూటర్ అవసరం ఏమొచ్చిందో మా కోడలు నాకు వివరించింది.

వీధి చివర ఇంట్లో వాళ్ల మూడేళ్ళ పాప కంప్యూటర్ నేర్చుకుని, దానిమీద ప్రయోగాలు చేసిందంట. అందుకని నా మనవడిని కూడా... అంతా విన్న నాకు నవ్వాలో, ఏడ్వాలో అర్థంకాలేదు.

ప్రొద్దున్నలేచింది మొదలు పాలు, టిఫిన్, భోజనాలు అన్ని నా మనవడికి కంప్యూటర్ దగ్గరే. వాడి చిన్ని చేతులతో దాని మీద ఏదో నొక్కుతుంటే అది చూసి నా కొడుకు కోడలు తెగ ముచ్చటపడిపోతూ, వాడి భవిష్యత్ మీద కలలు కనేస్తున్నారు. నాకు మాత్రం చాలా బాధ వేసింది. మధురమైన బాల్యాన్ని వాళ్ళ సంతోషం కోసం బలిచేస్తున్నారనిపించింది.

* * *

"మావయ్యా! మీకోసం రాఘవయ్యగారు వచ్చారు" కోడలిమాట విని నేను బయటకు వచ్చాను.

"రండి రాఘవయ్యగారు ఏంటి ఇలా వచ్చారు?" అడిగాను నేను.

"ఏం లేదు. నా మనవడు ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాడు కదా మా అబ్బాయి వాళ్ళ ఆఫీసు వాళ్ళు ఇవాళ సాయంత్రం చిన్న సన్మానం ఏర్పాటుచేశారు. మిమ్మల్ని పిలుద్దామని వచ్చాను. మీరు తప్పకుండా రావాలి"

"తప్పకుండా వస్తాను"

"కాఫీ తీసుకోండి" కోడలు రాఘవయ్యకు కాఫీ అందించింది.

"ఏంటండీ మీ మనవడు ఏదో ఘనత సాధించాడుట. పిల్లాడంటే అలా ఉండాలి. వాళ్ల తల్లిదండ్రులకి ఎంత పేరు తీసుకొచ్చాడో" మా కోడలు ఆపకుండా మాట్లాడుతోంది.

"అవునమ్మా అందరూ అదే మాట అంటున్నారు. ఇంక నేను వెళ్లొస్తాను" తాగిన కాఫీ గ్లాసు అక్కడ పెట్టి బయటికి నడిచాడు రాఘవయ్య.

నేను ఆయన్ని గుమ్మం వరకూ దిగబెట్టి వచ్చాను.

* * *

హాలంతా జనాలతో నిండి ఉంది. నేను అందర్నీ గమనిస్తూ మూల కూర్చున్నాను. రాఘవయ్య గారి కొడుకు, కోడలు చాలా సంతోషంగా తిరుగుతూ కనిపించారు. అడిగినవారికల్లా వాళ్ల అబ్బాయి చేసిన ఘనత గురించి చెబుతున్నారు. వచ్చినవాళ్లు కూడా వాళ్ల అబ్బాయి గురించే చర్చించుకుంటున్నారు.

"ఈ అబ్బాయి ఇంత చిన్న వయసులో ఎంత ఘనత సాధించాడు. ముందు ముందు ఇంకేం సాధిస్తాడో?" అన్నది అక్కడికి వచ్చిన ఒకావిడ.

"మా వాడూ ఉన్నాడు ఎందుకు పదో క్లాసు రెండవసారి చదువుతున్నాడు" అన్నది ఇంకొకావిడ వాళ్ల కొడుకును తిట్టుకుంటూ.

"ఒరేయ్ నువ్వు కూడా వాళ్ళబ్బాయి లాగే ఏడేళ్లకే పదోక్లాసు పాసై చూపించాలి. లేకపోతే..." వేలు చూపిస్తూ తన నాలుగేళ్ళ కొడుకుని మందలిస్తున్నాడు ఓ బాధ్యత తెలిసిన తండ్రి. నాకు అక్కడి వాతావరణం అంతా చిత్రంగా అనిపించింది. రాఘవయ్య గారి మనవడిని పూలమాలలతో ముంచెత్తుతున్నారు. వాడు మాత్రం అమాయకంగా అటూ ఇటూ దిక్కులు చూస్తున్నాడు. వాడి అమాయక మొహం చూస్తే నాలో ఆవేశం కట్టలు తెంచుకుంది. చాలా రోజులనుండి నాలో పెరుగుతున్న ఉద్వేగాన్ని నా మనసులో ఉన్న ఆలోచనలను అక్కడున్న ప్రతి తల్లీతండ్రికి చెప్పాలనిపించింది.

"బాల్యమనేది చాలా మధురమైనది. మనం కావాలనుకున్నా అది తిరిగిరాదు. పిల్లలని ఆటపాటలకి దూరం చేసి యంత్రాల్లా తయారుచేయడం అన్యాయం. అందరి పిల్లల్లోనూ ప్రతిభ అనేది దాగి ఉంటుంది. అది వెలికి తీసి వాళ్ళని ఆ బాటలో పైకి తీసుకురావాలి. అంతేగానీ ఎవరో ఏదో సాధించారని తమ పిల్లల్ని వాళ్లతో పోల్చి, చదువు పేరుతో వాళ్ల వయసుకి మించిన భారం మోపి వాళ్ళని ఉక్కిరిబిక్కిరి చెయ్యకూడదు. పిల్లల్ని రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలి గానీ రేపటి యంత్రాలుగా మాత్రం కాదు"

నా ఆవేదన అక్కడున్న ఎవ్వరికీ వినిపించడం లేదు. నా మాటలు ఆ చప్పట్ల హోరులో కలిసిపోయాయి. ఏమీ చెయ్యలేని నిస్సహాయతతో ఉండిపోయాను.

నా ఆవేదన అక్కడున్న పెద్దలకి కాకపోయినా కనీసం నా కొడుకు, కోడలు అర్థం చేసుకున్నాలనుకుని బయటకు నడిచాను.

★

